RNI NO.: 2011/39006

# పబ్లిక్ టుడే

దిన పత్రిక

మా అక్షరం జనం కోసం

కడప అన్నమయ్య

సంపుటి : 2 సంచిక : 232 మంగళవారం, 26 ఆగస్టు 2025

పబ్లిషర్ : రాజారెడ్డి- కసవనూరు, వెదురుకుప్పం మండలం, చిత్తూరు జిల్లా

## ఒంటిమిట్ట శ్రీకోదండరామాలయంలో శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ



**ఒంటిమిట్ట పబ్లిక్ టుడే** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం పవిత్ర సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా సీతాలక్ష్మణ సమేత శ్రీరాములవారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. ఉదయం బాలబోగం, చతుష్టానార్చన, పవిత్ర హెూమం, మధ్యాహ్న ఆరాధన, బలిహరణ, శాత్తుమొర, తీర్థ ప్రసాద గోష్ఠి చేపట్టారు.

అనంతరం ఉదయం 9 గంటలకు శ్రీ సీతా సమేత శ్రీ కోదండరామస్వామివారి ఉత్సవర్లకు ఘనంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంలతో స్వామి, అమ్మవారి ఉత్సవర్లకు విశేషంగా అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాలలో పవిత్రమాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు. ధ్రువమూర్తులకు, కౌతుకమూర్తులకు, స్నపనమూర్తులకు, బలిమూర్తులకు,

వివరాలు 2లో



## అవయవాలులేని వికలాంగుల కడుపు కొట్టడమేనా సుపరిపాలన అంటే

- తొలగించిన దివ్యాంగుల పెన్షన్లను పునరుద్ధరించాలని పులివెందులలో వికలాంగుల ధర్నా
- వైఎస్ఆర్సిపి పులివెందుల నియోజకవర్గ దివ్యాంగుల అధ్యక్షులు చాగలేటి భాస్కర్



**పులివెందుల టౌన్ (పబ్లిక్ టుడే):** రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల పెన్షన్లు తొలగించినందుకు నిరసనగా వికలాంగుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పులివెందుల పట్టణం అంబకపల్లి రోడ్డు లోని మినీ సెక్రటేరియట్ నందు గల ఆర్డీవో కార్యాలయం ఎదుట దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. అన్యాయంగా తొలగించిన నిజమైన వికలాంగుల పెన్షన్లు అర్హులైన వారికి పునరుద్ధరించాలని, ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చేందుకు కూటమి నాయకులు పెన్షన్ మొత్తాన్ని 15వేలు, 6వేల రూపాయలకు ఎవరూ అడగకపోయినా బూటకపు హామీలు ఇచ్చి, అధికారంలోకి రాగానే ఉన్న పెన్షన్లను తొలగించి దివ్యాంగుల కడుపు కొట్టడం ఎంతవరకు న్యాయమని, ఇదేనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెబుతున్న సుపరిపాలన? అని సూటిగా ప్రశ్నించారు? కాళ్లు, చేతులు, కళ్ళు కోల్పోయి దయనీయమైన పరిస్థితుల్లో జీవిస్తున్న వికలాంగుల పొట్టకొట్టి, సూపర్ సిక్స్ అంటూ ఇతర వర్గాలకు సొమ్ములను

వివరాలు 2లో

## కాల పరిమితిలోగా అర్జీలను పరిష్కరించండి



- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

**పబ్లిక్ టుడే. రాయచోటి, ఆగస్టు 25:-** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో నిశితంగా పరిశీలించి వేగవంతంగా, నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు,రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఏడి సర్వేయర్ భరత్ కుమార్,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి స్వీకరించిన విజ్ఞప్తులను నాణ్యతతో వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో నిశితంగా అర్జీలను పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలోగా ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

2లో..

## కూటమిపాలనలో మహిళల గౌరవానికి భంగం

- పాలకులే కీచకులైన వైనం
- మాజీ ఎమ్మెల్యే వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి



**ప్రొద్దుటూరు ఆగస్టు 25 పబ్లిక్ టుడే** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలల కాలంలో అభివృద్ధి సంక్షేమం పక్కన పెట్టి పాలకులే కీచకులుగా తయారై మహిళల ఆత్మ గౌరవానికి భంగం కలిగిస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచపల్లి శివప్రసాద్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రముఖ సినీ నటులు నందమూరి తారక రామారావు మనవడు జూనియర్ ఎన్టీఆర్ తల్లి పై అనంతపురం ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకోలేదని రాచమల్లు తెలిపారు. అనంతపురం టవర్ క్లాక్ దగ్గర ఎమ్మెల్యేచే స్వయంగా క్షమాపణ చెప్పించడం, సస్పెండ్ చేయకపోవడంలో అంతరార్థం ఏమిటని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని విమర్శించినప్పుడు తాను ఖండించానన్నారు. తల్లి ఎవరికైనా తల్లేనన్నారు. ఎన్టీఆర్ తల్లి పాదాలను ఎమ్మెల్యే కన్నీటితో కడిగి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగ పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వేశ్య అని సంబోధించినా ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు నిరసన తెలిపేందుకు కూడా ప్రభుత్వం అనుమతించకపోవడం దుర్మార్గం అన్నారు. కేవలం జూనియర్ ఎన్టీఆర్పై అసూయతోనే చంద్రబాబు, లోకేష్ ఇలా చేస్తున్నారని, జూనియర్ ఎన్టీఆరే ఎన్టీఆర్ కు అసలైన వారసుడని జోష్యం చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల టీడీపీ ఎమ్మెల్యేలు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, మాట్లాడినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. విజయవాడ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, కూన రవికుమార్,పవన్ కళ్యాణ్ వర్గీయులైన డ్యాన్స్ మాస్టర్ జానీ, కిరణ్ రాయల్ లు మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరించారన్నారు. స్వయంగా అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పోలీసులను దూషించినా పట్టించుకోవడం లేదన్నారు. టీడీపీ కార్యకర్త స్వయంగా ఎక్సైజ్ అధికారుల చొక్కా పట్టుకున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా స్థాయిని చూడకుండా తప్పు చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

2లో

# ఒంటిమిట్ట శ్రీకోదండరామాలయంలో శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ



మొదటి పేజీ తరువాయి విష్వక్సేనుల వారికి, ద్వారపాలకులకు, గరుడాళ్వార్‌కు, యాగశాలలోని హోమగుండాలకు, బలిపీఠానికి, ధ్వజస్తంభానికి, ఆలయం ఎదురుగా గల ఆంజనేయస్వామివారికి పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం పవిత్రహోమం, నివేదన, శాత్తుమొర జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ అ-ర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అవయవాలులేని వికలాంగుల కడుపు కొట్టడమేనా సుపరిపాలన అంటే"

మొదటి పేజీ తరువాయి ధారపోయడం ఎంతవరకు సమంజసమని, వికలాంగుల ఉసురు తగులుకొని ఇటువంటి ఫాసిస్టు ప్రభుత్వాలు పతనమయ్యే రోజులు మరెంతో దూరంలో లేవని, రీవెరిఫికేషన్ పేరుతో నిజమైన నడవలేని, చూపులేని, మాట, వినికిడి లేనివారు, చివరకు మానసిక వికలాంగుల పెన్షన్లు కూడా అవినీతి డాక్టర్ల కబంధహస్తాలతో, టార్గెట్ ప్రకారం తొలగించడం జరిగిందని, వెంటనే వీటన్నిటిని పునరుద్ధరించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, వికలాంగుల సంఘ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో చిన్నయ్య దివ్యాంగుల వద్దకే వచ్చి వారినుంచి వినతిపత్రం స్వీకరించి, పెన్షన్లు కోల్పోయిన వారి పత్రాలను తీసుకుని ప్రభుత్వానికి పంపి, అర్హులైన వికలాంగులకు త్వరితగతిన పెన్షన్లు పునరుద్ధరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్డీవో ఇచ్చిన హామీతో దివ్యాంగులు నిరసన దీక్షను విరమించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి, మున్సిపల్ కమిషనర్ రాములుకు వినతిపత్రం అందించి, మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన వికలాంగుల పెన్షన్లు పునరుద్ధరించాలని కోరారు.

ఈకార్యక్రమంలో వికలాంగుల సంఘాల ఐక్యవేదిక కార్యవర్గ సభ్యులు శీలం సునీల్ కుమార్, రామకృష్ణ, చాగలేటి శివప్రసాద్ చాగలేటి ఉమాదేవి, రామసుబ్బయ్య రామాంజనేయులు, ఈశ్వరయ్య, రవి, అశ్వని, స్వర్ణలత, తులసి, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మత్తు వ్యసనం లేకుంటేనే సమాజం లో గౌరవం : డాక్టర్ హరిఫుల్ల




- ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరులు గా ఎదగాలి: ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి
- కుటుంబం లోని మత్తు బానిసలను మార్చగలిగే శక్తి విద్యార్థికి ఉంది
- స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు

**పులివెందుల టౌన్ (పబ్లిక్ టుడే)**

మత్తు వ్యసనం లేనప్పుడే సమాజం లో గౌరవం లభిస్తుంది అని ప్రాథమిక వైద్యాశాల వైద్యులు డాక్టర్ హరిఫుల్ల పేర్కొన్నారు. తొండూరు మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం మాదక ద్రవ్యాల నివారణ పై నిర్వహించిన అవగాహనా కార్యక్రమం లో ప్రాథమిక వైద్యాశాల వైద్యులు డాక్టర్ హరిఫుల్ల మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం, గంజాయి, బ్రౌన్ షుగర్ లాంటి మత్తు పదార్ధాల అలవాటు తో మానవ శరీరం లోని అవయవాలు దెబ్బ తిని అనారోగ్యం పాలై కుటుంబం ఆర్థికంగా వెనకబడి పిల్లల పోషణ భారమై రేపటి పౌరులు గా ఎదగవలసిన బాల్యాన్ని బానిసలుగా చేయడమే కాకుండా సమాజం లో గౌరవాన్ని కోల్పోవడం కన్నా, మత్తు వ్యసనాలు లేకుంటేనే సమాజం లో గౌరవం దక్కుతుంది అని అన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కష్టాన్ని, గురువుల కృషి ని మరవకుండా, మంచి స్నేహితులను ఎంచుకుని, భవిష్యత్ ప్రణాళిక లతో ఉత్తమ పౌరులు గా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రుల కు మరియు కుటుంబ సభ్యులకు వారి పిల్లలే వారికి స్థిరాస్థి కావున ఒకవేళ కుటుంబం లోని వ్యక్తులు మత్తు పదార్థాలకు బానిసలుగా ఉంటే వారిని వాటి బానిసత్వం నుండి విముక్తి చేయగలిగే శక్తి విద్యార్థి కి ఉంది కావున తగిన ఆలోచన, ప్రణాళిక బద్దంగా వ్యవహరిస్తే తప్పకుండ అలాంటి వారిలో మార్పు తెచ్చి సమాజ హితులు గా తయారు చేసే అవకాశం ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులచే మత్తు పదార్థాల వలన కలిగే దుష్పరినామాలను తెలియజేసే పోస్టర్ లను విడుదల చేశారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయ బృందం, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

# కూటమిపాలనలో మహిళల గౌరవానికి భంగం

మొదటి పేజీ తరువాయి పోలీసులు తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించకుండా అధికార పార్టీకి గుమస్తాలుగా, బానిసలుగా పనిస్తుండటంతో సిగ్గుపడాల్సి వస్తోందన్నారు. సమాజానికి రక్షణగా నిలవాల్సిన పోలీసులు ఇలా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఏ పార్టీ అయినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది ఐదేళ్లే అని, పోలీసులు చట్టబద్ధంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్సీపీ పట్టణా ధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్రెడ్డి, కౌన్సిలర్లు ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, సత్యం, రాగుల శాంతి, గుర్రం లావణ్య, బీఎన్ఆర్ పాల్గొన్నారు.

# కాల పరిమితిలోగా అర్జీలను పరిష్కరించండి

మొదటి పేజీ తరువాయి నియోజకవర్గ,మండల ప్రత్యేక అధికారులు అంగన్వాడి సెంటర్లు, మధ్యాహ్న భోజన పథకం, ఎస్ డబ్ల్యూ పిసి, గృహ నిర్మాణ పనులను పర్యవేక్షించి సమస్యలను గుర్తించి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీ దారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు.

**పిజిఆర్ఎస్ లో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు**

1)చిట్వేలు మండలం తుమ్మ కొంద గ్రామానికి చెందిన పుల్లగంటి ఈశ్వరమ్మ తనకు హౌస్ ఫోల్డ్ మ్యాపింగ్ లో ఇతర వ్యక్తుల పేర్లు ఉండటం వల్ల నాకు వితంతు పెన్షన్ మంజూరు కావడం లేదని, పెన్షన్ మంజూరు చేయవలసిందిగా కోరుతూ జిల్లా కలెక్టర్ కు విన్నవించుకున్నారు.

2)వీరబల్లి మండలం గండికోట గ్రామహరిజనవాడ కు చెందిన ఎం. అంజనమ్మ బియ్యం కార్డు నందు తమ పేరును పునరుద్దించ వలసినదిగా కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.

3)మదనపల్లి మండలం వెంకప్ప కోట గ్రామపంచాయతీ పరిధిలోని పున్నూరు వాండ్లపల్లి కు చెందిన ఎస్. జయమ్మ %ఢ/శీ% గోపాల్ రెడ్డి రెండు సంవత్సరాలుగా వికలాంగుల పెన్షన్ వస్తుండేదని, ప్రస్తుతం తనకు పెన్షన్ రద్దు అయినట్లు సచివాలయం వారు తెలపడం జరిగిందని, సదరం సర్టిఫికెట్లు 69 శాతం వికలాంగత్వం ఉన్నందున నాకు వికలాంగుల పెన్షన్ మంజూరు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ కు విన్నవించుకున్నారు.

4)సంబెపల్లి మండలం నారాయణరెడ్డి గ్రామపంచాయతీ పరిధిలోని సుద్దుల వాండ్లపల్లికు చెందిన ఎం రామచంద్ర తనకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింప చేయవలసిందిగా కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు పలు ప్రాంతాల నుండి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## విద్యుత్ స్తంభం మార్చండి మహాప్రభో



**పోరుమామిళ్ల (పబ్లిక్ టుడే)** పోరుమామిళ్ల పట్టణం ముస్లిం కోట వీధి 9 వ వార్డులో రోడ్డుపైన విద్యుత్ స్తంభం ఒరిగి ఇండ్లపై పడే పరిస్థితి ఉందని ఆ విద్యుత్ స్తంభం పూర్తిగా పై భాగంలో చీలి ఎప్పుడు కింద పడుతుందో తెలియని దారుణ పరిస్థితిలో ఉందని దానిని వెంటనే మార్చి పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ పోరుమామిళ్ల మండల అధ్యక్షులు అన్వర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం కోటలోని ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభాన్ని స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించి, వర్షం పడితే తడిసి ఇండ్లపై పడే పరిస్థితి ఉందని అలాంటి సంఘటన జరిగితే ప్రాణ నష్టం కూడా జరిగే పరిస్థితి కనిపిస్తుందని ఆయన విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపుగా మూడు సంవత్సరాల నుంచి ఈ విద్యుత్ సమయం పై స్థానిక ప్రజలు, నాయకులు అనేకమార్లు ఫిర్యాదులు చేసిన అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు ఆయన వద్ద వాపోయారు. ఈ విషయంపై వెంటనే విద్యుత్ అధికారులకు సమస్యను పరిష్కరించ కపోతే స్థానిక ప్రజలతో విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

# వికలాంగు పింఛన్ తొలగింపు



**కాశి నాయన( పబ్లిక్ టుడే ) ఆగస్టు 25**

కాశినాయన మండలం ఎ నరసాపురం గ్రామంలో నీరగంటి దాదా పీర్ భార్య భసిరుణ్ అనే ఆమె కొన్ని సంవత్సరాలగా పింఛన్ తీసుకుంటుంది. ఆమె వికలాంగులు కాదు అని పింఛన్ తీసివేశారు. చిన్నప్పటినుంచి మూగ చెవుడు వెరిఫికేషన్ చెయ్యకుండా ఎలా తొలగిస్తారు. అని ఆ కుటుంబ సభ్యులు బాధను చెప్పుకున్నారు. పింఛన్ తీసివేయడం వల్ల కుటుంబం భారంగా మారింది. దయచేసి కూటమి ప్రభుత్వం త్వరగా వెరిఫికేషన్ చేసి రేపు నెల ఒకటవ తేదీ పింఛన్ వచ్చేటట్లు చూడాలని కుటుంబ సభ్యులకు కోరుతున్నారు.

# దివ్యాంగుల పెన్షన్ తొలగింపు దుర్మార్గం

- కూటమి ప్రభుత్వంపై తీవ్ర ఆవేదన వ్యక్తం...
- ప్రజా సమస్యలపై నిరంతరంగా పోరాడే పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్
- కడప నియోజకవర్గంలోనే 700కి పైగా దివ్యాంగుల పెన్షన్లు తొలగించిన కూటమి ప్రభుత్వం







**వైఎస్ఆర్ కడప, పబ్లిక్ టుడే :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో మరియు బాధిత దివ్యాంగులు ఈరోజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత 15 నుండి 20 సంవత్సరాలుగా పెన్షన్ తీసుకుంటున్న దివ్యాంగులను, ఇటీవల ఏర్పడిన టిడిపి–జనసేన–బిజెపి కూటమి ప్రభుత్వం పెన్షన్ జాబితాల నుంచి తొలగించిందని వారు ఆరోపించారు.

"మేము ఎటువంటి పని చేయలేని పరిస్థితుల్లో ఉన్నాము. కుటుంబానికి భారంగా మారకుండా, స్వయంగా జీవించేందుకు ఆ పెన్షన్ మాత్రమే ఆధారంగా ఉంది. ఇప్పుడు ఆ సహాయం కూడా తీసేయడం అమానుషం, అన్యాయం."

అలాగే, పూర్వం 100% వైకల్యం ఉన్నట్లు గుర్తించిన వారికి ఇప్పుడు 40%కి తగ్గిస్తూ ఇవ్వడమూ తీవ్రంగా నొప్పించింది. ఇది నిర్వాహక వ్యవస్థలో మానవతా విలువలున్నాయా అనే సందేహం కలిగిస్తోంది.

సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు సెప్టెంబర్ నెల నుంచి పెన్షన్ తొలగించినట్టు నోటీసులు ఇచ్చారు. దివ్యాంగుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణం స్పందించి, పెన్షన్‌లను తిరిగి పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యదర్శి రెడ్డెం వెంకటసుబ్బారెడ్డి గారు, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు అహ్మద్ బాషా (సాజన్), దివ్యాంగుల విభాగం నగర అధ్యక్షుడు కరీముల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, జిల్లా మరియు నగరం అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు ఉన్నారు.


## దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ



**పబ్లిక్ టుడే రాయచోటి : ఆగష్టు 25** లో విజిలెన్స్ అధికారులు ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడులు కడప స్టేట్ అసిస్టెంట్ కమిషనర్ బాబు మోసెస్ బృందం, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి సోమవారం రాయచోటిలోని రైతు సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీలర్లు యూరియా, ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు పాల్పడితే 6ఏ కేసులు నమోదు చేసి, లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

## 'సమీచీనం' పుస్తక పరిచయ సభ






**మైదుకూరు పబ్లిక్ టుడే** ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేమల సలీం భాష కవిత్వీకరించిన ' సమీచీనం' పుస్తక పరిచయ కార్యక్రమాన్ని తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 29వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కడప ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప ప్రభుత్వ పురుషులకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ , పుస్తక పరిచయం చేసేటందుకు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య,విశిష్ట అతిథిగా 'కవయిత్రి' జి యల్ లావణ్య , ఆత్మీయ అతిథిగా వల్లూరు జిల్లా పరిషత్ హై స్కూల్ తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ జి వి సాయిప్రసాద్, గౌరవ అతిథిగా ప్రముఖ కవి వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం గౌరవ సలహాదారులు ఎస్ఏ సత్తార్ ఫైజి, ప్రత్యేక అతిథిగా అనంతపూర్ ప్రభుత్వ పురుషుల కళాశాల జువాలజీ అధ్యాపకులు జి ఎల్ ఎన్ ప్రసాద్ విచ్చేయనున్నారని, ఎస్ కే ఆర్ ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఎం వి నాగ సుధారాణి సమన్వయకర్తగా వ్యవహరిస్తారని అన్నారు. కార్యక్రమానికి ముందుగా తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తారని తెలియజేశారు.

## అర్ధరాత్రి మద్యం మత్తులో యువకులు హల్చల్



**పబ్లిక్ టుడేలి రాయచోటి : ఆగష్టు 24:**రాయచోటి పట్టణంలోని మాసాపేట లోని ప్రధాన రహదారిపై ముగ్గురు వ్యక్తులు అర్ధరాత్రి మద్యం మత్తులో హల్చల్ చేశారు. మద్యం మత్తులో ప్రధాన రహదారిలో ఉన్న ఇంటిని, ఇంటి ప్రాంగణంలో నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా ఢీ కొనడంతో ఇంటి గోడ మరియు ద్విచక్ర వాహనం తీవ్రస్థాయిలో ధ్వంసం అయ్యాయి. ఈ ప్రమాదం సమయంలో కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో మద్యం మత్తులో కారు నడుపుతున్న ఒకరికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరికీ ఎటువంటి గాయాలు కాలేదు. నైట్ డ్యూటీ లో విధులు నిర్వహిస్తున్న సీఐ జాన్ జోసెఫ్, హెడ్ కానిస్టేబుల్ శంకర్ రాజు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం ఘటనపై ఆరా తీసి గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## జీవరాశికి భద్రతను ఇచ్చే భాద్రపదం



**మైదుకూరు పబ్లిక్ టుడే**సకల జీవరాసులకు భద్రత నిచ్చే భాద్రపదం ఆరవదని వేద పండితులు మధురభారతం సుధీర్ శర్మ ప్రవచించారు. భాద్రపద మాసం భక్తి, ఆత్మ శోధన, ఆధ్యాత్మిక పునరుద్ధరణకు పవిత్రమైన కాలమని పేర్కొన్నారు. ఆగస్టు 23 నుండి భాద్రపద మాసం ప్రారంభమైందన్నారు. చాంద్రమాన పద్ధతిలో పౌర్ణమి నాడు చంద్రుడు పూర్వాభాద్ర /ఉత్తరాభాద్ర నక్షత్రంలో కలిసి ఉండటం వల్ల భాద్రపద మాసం అని పేరు వచ్చిందని వేద పండితులు చారేపల్లి శేషశైలేంద్ర శర్మ తెలియజేశారు. సోమవారం మహా కవయిత్రి మొల్ల సాహితీ పీఠం కార్యాలయం ఆవరణలో భాద్రపదమాసం ఆవిర్భావ పూజ, వినాయక చవితి విశిష్ట పూజలు నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త ,భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్, డాక్టర్ ,గానుగపెంట హనుమంతరావు, పీఠము ప్రధాన కార్యదర్శి జీవీ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం భాద్రపద శుద్ధ విదియ రోజున జరిగింది. విద్వాన్, డాక్టర్, గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ తాను కూడా భాద్రపద మాస శుద్ధ విదియ రోజున జన్మించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రెండు రోజులలో వినాయక చవితి పండుగను దేశమంతటా నిర్వహిస్తున్న శుభవేళ గణపతి మంత్ర బీజమైన "ఓం గం గణపతయే నమః "అని 21 మార్లు భక్తితో జపిస్తే సర్వ అరిష్టాలు తొలగి, శుభములు కలుగుతాయని ఋగ్వేదంలో, ఉపనిషత్తులలో మహర్షులు బోధించారన్నారు. ఆంగ్లేయుల పాలనలో హిందూ జాతిని ఒక్కటి చేయడానికి లోకమాన్య బాలగంగాధర్ తిలక్ ప్రారంభించిన గణపతి ఉత్సవాలు నిర్వహించడంవల్ల హిందూ ధర్మానికి ఒక విశిష్టత చేకూరిందని తెలుగు పండితులు జీవి మనోజ్ కుమార్ పేర్కొన్నారు.

అనంతరం గణపతి హోమం,నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమం నిర్వహించినారు. త దనంతరం వేద పండితులు సుధీర్ శర్మ, శేష శైలేంద్ర శర్మలను హనుమంతరావు సత్కరించారు.

# నైపుణ్యాభివృద్ధి కేంద్రం, గ్రంథాలయం ప్రారంభం





**మైదుకూరు పబ్లిక్ టుడే** రెడ్డి సేవా సమితి వసతి గృహంలో చదివే విద్యార్థినులకు నైపుణ్య శిక్షణ అందించడం కోసం రెడ్డి సేవా సమితిలో యోగివేమన నైపుణ్యాభివృద్ధి కేంద్రం, గ్రంథాలయాలను ప్రారంభించినట్లు కడప రెడ్డి సేవాసమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం రెడ్డి సేవా సమితి భవనం లో కడప చిన్మయ మిషన్ అధ్యక్షుడు తురీయానంద స్వామి ఆధ్వర్యంలో పూజారి కార్యక్రమాలు నిర్వహించారు. లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ ఇక్కడ చదివే విద్యార్థినులకు చదువు పూర్తవుతూనే ఉద్యోగం, స్వయం ఉపాధి వైపు నడిపించే లక్ష్యం తో ఈ సెంటర్ ను ప్రారంభించామని ఈ సెంటర్కు అరబిందో ఫార్మ్ ఫౌండేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కంభం నిత్యానంద రెడ్డి, డైరెక్టర్ పి శరత్ చంద్రారెడ్డి ఆర్థిక సహకారం అందించారని వారికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని అన్నారు. సభాధ్యక్షులుగా వ్యవహరించిన డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులను ఒక నిర్దిష్టమైన పనిని సమర్థవంతంగా చేసే దిశగా ప్రయాణింప చేయాలని సదుద్దేశంతో నైపుణ్యాభివృద్ధి సెంటర్ తోపాటు, గ్రంథాలయాన్ని కూడా ప్రారంభించామన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నైపుణ్యాలను మెరుగుపరచడం వల్ల విద్యార్థులకు ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, వారికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యం, సామర్థ్యం పెంపొందించుకునేటందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ ఆవుల సుధాకర రెడ్డి ప్రసంగిస్తూ సాంకేతిక పరిజ్ఞానం దినదినాభివృద్ధి చెందుతున్న ఇలాంటి సమయంలో నూతన నైపుణ్యాలను నేర్చుకోవడం వల్ల విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించవచ్చు అన్నారు. ఆత్మీయ అతిథి డాక్టర్ రాసుపల్లి వీర సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్య అభివృద్ధి సాధించడం ద్వారా తాము ఎంచుకున్న రంగాల్లో అభివృద్ధి సాధిస్తారన్నారు. గౌరవ అతిథి ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ప్రసంగిస్తూ రెడ్డి సేవా సమితి వారు గ్రంథాలయాన్ని ప్రారంభించడం శుభ పరిణామని, గ్రంథాలయం ద్వారా విద్యార్థినిలు విద్య తో పాటు ఉన్నత విలువలతో కూడిన జీవితాన్ని అలవర్చుకుంటారని అన్నారు. చివరగా గుడ్ల ఆదినారాయణ రెడ్డి రెడ్డి సేవా సమితి చేసి సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను వివరించి చెప్పారు. మాలవ్య, యశస్వి స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో గుర్రంపాటి వెంకటరెడ్డి, రమేష్ రెడ్డి, ఆనంద కుమార్ రెడ్డి, ఎల్లపు రెడ్డి శివన్నారాయణ రెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తోటిమాలపల్లికి తాగునీటి వసతిని కల్పిస్తాం



▶ ఎంపీపీ రాజమ్మ

**పబ్లిక్ టుడే సుండుపల్లి: ఆగస్టు 25:** సుండుపల్లి మండలం పెద్దినేని కాలవ గ్రామం తోటి మాలపల్లి ప్రజలుకు "నీటి కొరత" "నీటి నిల్వ" సమస్య ఉందని మూడే రాజమ్మ కి వినతి పత్రం సమర్పించిన తరుణంలో సానుకూలంగా స్పందించి గ్రామపంచాయతీ నిధులు లేకపోవడంతో తోటి మాలపల్లి కి సొంత నిధులతో "బోరును" మంజూరు చేస్తామన్న మూడే రాజమ్మ . ప్రభుత్వ అధికారులను విచారించి అక్కడున్న సమస్యలను తెలుసుకుని, సొంత నిధుల నుంచి ఊరుకి నిధులు అందిస్తామని చెప్పారు. పెద్దినేని కాల్వ గ్రామ సర్పంచ్ కి ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోని, పరిస్థితులలో రాజమ్మ, ముందుకొచ్చి వారి సొంత నిధులను తోటి మాలపల్లి కి అందిస్తామని, తెలపడం ఎంతో సంతోషదాయకంగా ఆ గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. పెద్దినేని కాలువ పంచాయతీ సెక్రెటరీ శ్రీనాథ్ రెడ్డి సహాయ సహకారాలతో తోటి మాలపల్లి ప్రజలకు శాశ్వతంగా నీటి కొరత తొలగనుంది. అలాగే ఆ గ్రామ పంచాయతీ నిధులు సమకూరిన అనంతరం తోటి మాలపల్లి కు నీటి నిల్వ ఉంచేందుకు పెద్ద ట్యాంక్ ని నిర్మిస్తామని చెప్పారు.

# "ఓట్ చోర్ - గద్ది చోడ్" నిరసన ర్యాలీ




**పీలేరు, ఆగష్టు 25, పబ్లిక్ టుడే:** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా జరుగుతున్న "ఓట్ చోర్ గద్ది చోడ్" ఉద్యమంలో భాగంగా ఆదివారం పీలేరు పట్టణంలోని విస్తృత స్థాయిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ పీలేరు మండల అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. బిఆర్ అంబేద్కర్ సర్కిల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పీలేరు మండల అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్ మాట్లాడుతూ.. "రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేస్తూ మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందని గత ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ తో కలిసి దొంగ ఓట్లతో బీజేపీ ప్రభుత్వం కుమ్మక్కు అయిందని దీనికి సంబంధించిన పూర్తి సాక్షాలను రాహుల్ గాంధీ స్వయంగా బెంగళూరులో 90 నిమిషాలపాటు ప్రెస్ మీట్ లో వివరించారని అన్నారు. ఉన్న ఓట్లు తొలగించి లేని ఓట్లు యాడ్ చేయడం ద్వారా ఎన్నికల్లో గెలపొందారని లోక్సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శిస్తూనే వస్తున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని కాపాడుతుందని మరియు ఓటరు హక్కులను మన చివరి శ్వాస వరకు కాపాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అనేక మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా తప్పుపట్టారు.

# యూట్యూబ్ ఆదిశేషు పై దాడి



▶ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన శేషు

**పులివెందుల( పబ్లిక్ టుడే )** యూట్యూబర్ సుంకేసుల ఆది శేషుపై టిడిపి మూకలు దాడి చేశారనీ పోలీసులకు పిర్యాదు చేశారు. సోమవారం పట్టణంలోని కెనరా బ్యాంక్ సమీపంలో ఉన్న ఒక ఎలక్ట్రికల్ షాప్ దగ్గర .ఆర్ తిమ్మల పల్లె కు చెందిన టిడిపి నాయకుడు విశ్వనాథరెడ్డి దాడి చేసి కారును ధ్వంసం చేశారని ఆదిశేషు తెలిపారు. ఈ దాడి లో ఎడమ చేయి విరిగినదని అలాగే తలకి గాయాలయ్యాయి అని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్సీపీ తరుపు ప్రచారం చేసినందుకే దాడి చేశారన్నారు. అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరారనని చికిత్స అనంతరం పోలీస్ స్టేషన్ కు వచ్చి సీఐ,ఎస్ఐ ఎవరూ లేక ఏఎస్ఐ సిద్దార్థ కి ఫిర్యాదును చేశానీ శేషు తెలిపారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

# పులివెందులలో 28వ తేదీ నుంచి శ్రీ రంగనాథ స్వామి నూలు పూజ ఉత్సవాలు





**పులివెందుల (పబ్లిక్ టుడే)** పులివెందుల పట్టణంలో వెలసిన పురాతన శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ఈనెల 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు నూలు పూజ పవిత్రోత్సవాలు నిర్వహిస్తు న్నట్లు ఆలయ చైర్మన్ చింతకుంట సుధీ కర్ రెడ్డి, ఈవో కె.వి.రమణ తెలిపారు. ఈనెల 28 తేదీ నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు ఉదయం స్వామివారి మూలవిరాట్ కు ప్రత్యేక అభిషేకాలు ప్రతిరోజు నిర్వహిస్తారన్నారు. ప్రతిరోజు సాయంత్రం వేళ వివిధ వాహనాలపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువు తీర్చి వాహన సేవ పూజలు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 5వ తేదీన ఉదయం చల్లా వంశీయుల ఆధ్వర్యంలో శ్రీ రంగనాథ స్వామి శ్రీదేవి భూదేవిల కల్యాణోత్సవం ఉంటుందన్నారు. అదే రోజు స్వామివారి కల్యాణం అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం కూడా ఉంటుందన్నారు.

ఆగస్టు 28 తేదీన స్వామి వారికి హనుమద్ వాహన సేవ ఉంటుంది. 29వ తేదీన సింహ వాహన సేవ, 30వ తేదీన గరుడ వాహన సేవ, 31వ తేదీన ఆదిశేష వాహన సేవ, సెప్టెంబర్ ఒకటవ తేదీన చంద్రప్రభ వాహన సేవ, రెండవ తేదీన హనుమద్ వాహన సేవ, మూడో తేదీన అశ్వ వాహన సేవ, నాలుగో తేదీన హంస వాహన సేవ, ఐదవ తేదీన గజవాహన సేవ నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం




▸ శిబిరాన్ని పరిశీలించిన మునిసిపల్ ఇంచార్జి వైయస్ మనోహర్ రెడ్డి

**పులివెందుల టౌన్ పబ్లిక్ టుడే:** స్థానిక భాకరాపురం లోని అర్బన్ హెల్త్ సెంటర్ నందు అమెరికా లో ఉంటున్న పులివెందుల వాసి తిరుమల రెడ్డి మరియు శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వైయస్ మనోహర్ రెడ్డి గారు సందర్శించి ప్రజలకు అందిస్తున్న చికిత్స ల గురించి తెలుసుకున్నారు , స్వయంగా ఆయన కంటి పరీక్షలు చేయించుకొని వారు కల్పిస్తున్న వైద్య సేవలను కొనియాడారు.

అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ గతం లో కూడా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడానికి వైఎస్ మనోహర్ రెడ్డి గారు ఎన్నో సౌకర్యాలు ఏర్పాటు చేసి ఈ కార్యక్రమం దిగ్విజయం కావడానికి ఎంతో కృషి చేశారని ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు హాల్ గంగాధర్ రెడ్డి, వైస్ చైర్మెన్ హాఫీజ్ పట్టణ ఉపాధ్యక్షులు కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్,కౌన్సిలర్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు రంగాపురం మధు, కొంగనపల్లి రవి, పద్మనాభ రెడ్డి, ఆర్యవైశ్య నాయకులు సాయిబాబు , బాబు, శంకర్ నేత్రాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వినాయక చవితి వేడుకలకు సర్వం సిద్ధం

**చెన్నూరు (పబ్లిక్ టుడే)** విఘ్నాలను తొలగించే వినాయకునికి ఈనెల 27వ తేదీన నిర్వహించబోయే వినాయక చవితి వేడుకలకు పురస్కరించుకొని ఆయా కమిటీల ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. స్థానిక పోలీస్ అధికారుల సూచనలు ,సలహాల మేరకు మండపాల అనుమతి కోసం సోమవారం రోజు వరకు దాదాపు 65 విగ్రహాలకు అనుమతులను తీసుకోవడం జరిగింది. అంటే మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకుని విగ్రహాలకు కొలువుకై అనుమతులు మంజూరు చేయడం జరిగింది. గతంలో కంటే ఈ ఏడాది ఎక్కువ మంటపాలన సిద్ధం చేసుకుని వినాయకుని బొమ్మలను నిలిపేందుకు యువకులు ఎంతో ఉత్సాహంతో ముందుకెళ్తున్నారు. ఇప్పటికే చాలామంది ఆయా మండపాలలో విగ్రహాలను తెచ్చి సిద్ధంగా ఉంచారు అయితే కమిటీల



నిర్ణయం మేరకు ఎప్పటి నుంచి ఎప్పటి వరకు మంచి ముహూర్తం చూసుకొని వారి వసతుల మేరకు3, 5, 9, 11 రోజుల వరకు ఉంచి అనంతరం నిమజ్జనం చేసేందుకు సిద్ధమవుతున్నారు.వినాయక చవితి పండుగను పురస్కరించుకొని అంగరంగ వైభవంగా మేళ తాళాలతో ఊరేగించుకుంటూ దూర ప్రాంతాల నుంచి విగ్రహాలను తీసుకొని రావడం జరిగింది.

ఈ విగ్రహాలను పండితుల చేతుల మీదుగా పూజలు నిర్వహించిశుభ ముహూర్తం చూసుకొని ప్రారంభోత్సవం చేయడం జరుగుతుంది. అనంతరం వారు వారు నిర్ణయించిన రోజు వరకు ఎంతో ఘనంగా ప్రత్యేక పూజలు చేసి అనంతరం నిమజ్జన కార్యక్రమం ఎంతో వైభవంగా చేయడం జరుగుతుంది.

# 'మానవతకు' ఎన్నారై సతీష్ రెడ్డి దంపతుల వితరణ

**కడప, పబ్లిక్ టుడే:** కడప పట్టణంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో లోమడ సతీష్ రెడ్డి, శిల్పారెడ్డి,( అమెరికాలో నివాసం ఉంటున్న) వారి తల్లి కీర్తిశేషులు లోమడ సుబ్బలక్ష్మమ్మ ప్రముఖ సంఘ సేవకురాలు, రాష్ట్ర వికలాంగుల సంస్థ చైర్మన్ పద్మావతి మహిళా మండలి అధ్యక్షురాలు, వృద్ధాశ్రమాన్ని నిర్మించి వృద్ధులకు ఎన్నో సేవా కార్యక్రమాలు కొనసాగించారు.ఎన్నారై సతీష్ రెడ్డి తన తల్లిదండ్రులు స్వర్గీయ సుబ్బలక్షుమ్మ, సుబ్బారెడ్డిల జ్ఞాపకార్థం బాడీ ఫ్రీజర్ ను మానవతకు అందించారు. ఇంటాక్ కన్వీనర్, మానస గ్రూప్ ఆఫ్ హెూటల్స్ అధినేత, లయన్ చిన్నప్ప రెడ్డి,వ్యవస్థాపకులు ఎన్. రామచంద్రారెడ్డి చేతులమీదుగా బాడీ ఫ్రీజర్ బాక్స్ ను ప్రారంభించారు.చిన్నపరెడ్డి మాట్లాడుతూ తల్లి తండ్రుల పేరు మీద సతీష్ కుమార్ రెడ్డి ఫ్రీజర్ బాక్స్ ను అందించడం అభినందించదగ్గ విషయమని ఇలాంటి దాతల సహాయముతో సుదూర ప్రాంతంలో ఉన్న కుమారులు వారి కుటుంబ సభ్యులు మరణించినప్పుడు ఫ్రీజర్ బాక్స్ లు ఎంతగానో ఉపయోగపడ



తాయన్నారు.వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కష్టాలలో ఉండే వ్యక్తిని ఆదుకోవడమే మానవతా ధర్మమని తెలియజేశారు. పరులకు సేవ చేసినప్పుడు మనకు ఆత్మ సంతృప్తి కలుగుతుందని ఇతవు పలికారు. వారి తల్లి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబానికి దేవుని ఆశీస్సులు ఉండాలని మనసా వాచా కోరుకుంటున్నాము.

ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు ఆచార్య జి సాంబశివరెడ్డి, సెంట్రల్ కమిటీ డైరెక్టర్లు డాక్టర్ అవటాల రామాంజుల రెడ్డి, రాటాల గోపి, శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ వెంకటరామి రెడ్డి, నగర కార్యదర్శి ఏ. సుబ్బయ్య, ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, బైరెడ్డి రామకృష్ణారెడ్డి, ఎల్లారెడ్డి రిటైర్డ్ హెడ్మాస్టర్ డాక్టర్ సి సుబ్బారెడ్డి, సమ్మెట సత్యనారాయణ, కృష్ణారెడ్డి, పి ప్రతాపరెడ్డి, ఇతర మానవతా కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగినది.

# మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోండి

▸ జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

**రాయచోటి ఆగస్టు 25,పబ్లిక్ టుడే:** జిల్లాలో మాదకద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మాదకద్రవ్యాల జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల నివారణ రవాణాను అరికట్టేందుకు ప్రణాళిక బద్ధంగా సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 530 ఉన్నత పాఠశాలలో ఇప్పటికీ 430 ఈగల్ క్లబ్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని త్వరితగతిన మిగతా స్కూల్స్ నందు పూర్తిస్థాయిలో ఈగల్ క్లబ్స్ త్వరితగతిన ఏర్పాటు చేసి ప్రతినెల అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని డీఈఓ ను ఆదేశించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ వారు ఇంకా అవగాహన కార్యక్రమాలు పెంచాలని తెలిపారు. మందుల షాపుల యందు డాక్టర్




రాసిన చీటీలు లేకుండా మందులు ఇవ్వరాదని, తరచూ మందుల షాపులను తనిఖీలు చేయాలని డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు ఆదేశించారు.అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి మాట్లాడుతూ జిల్లాలో పోలీస్ శాఖ వారికి ఇప్పటికే 735 అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని ఇంకా ఈ కార్యక్రమాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈగల్ టిం ద్వారా డ్రగ్స్ వద్దు బ్రో, అనే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు.అలాగే కాలేజీలు మరియు స్కూల్లో పరిసర ప్రాంతాలలో 100 మీటర్ల లో ఎలాంటి సిగరెట్టు, పొగాకు తదితర వస్తువులను అమ్ముకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని, ఇప్పటివరకు 882 కేసులు పెట్టడం జరిగిందని తెలిపారు. అలాగే సిసి టీవీ,డ్రోన్ల ద్వారా పర్యవేక్షించడం జరుగుతున్నదని తెలిపారు. ఇంకా అవగాహన కార్యక్రమాన్ని పెంచేందుకు కృషి చేస్తామని అన్నారు.అనంతరం గంజాయి డ్రగ్స్ మధ్యలో చీకటిలో పడిపోకు,సామూహిక సంకల్పం సమాజ శ్రేయస్సు, జీవితం ఒక వరం దాన్ని మత్తులో నాశనం చేయవద్దు, గంజాయి డ్రగ్స్ రహిత సమాజం కోసం ముందడుగు, డ్రగ్స్ గంజాయి బానిసత్వం నుండి బయటకు రండి తదితరులు పోస్టర్లను జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆవిష్కరించారు

ఈ సమావేశంలో మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ మసూదన్ రావు,రాయచోటి ఆర్డిఓ శ్రీనివాస్, ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఏఈఎస్ జోగేంద్ర, డి.ఎస్.పి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ అభివృద్ధి లక్ష్యంగా పాలకమండలి కృషి చేయాలి

▶ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



**ప్రొద్దుటూరు, ఆగష్టు 25, పబ్లిక్ టుడే** ప్రొద్దుటూరు పట్టణం బొల్లవరంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థాన అభివృద్దే లక్ష్యంగా నూతన ధర్మకర్తల మండలి కృషి చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. సోమ వారం స్థానిక ఆలయంలో ధర్మకర్తల మండలి నూతన చైర్మన్ గా దాదిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, పాలకమండలి సభ్యులుగా పి.రాధ, జి.రాజేశ్వరి, సి.సావిత్రి, ఆర్.ప్రసాద్, జి.శివ నాగిరెడ్డి, వై.శ్రీనివాసుల రెడ్డి, ధనుంజయ శర్మ, ఎక్స్ అఫీషియో మెంబర్ గా లక్ష్మినారాయణ శర్మప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్య క్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని విషయాలు దైవాను గ్రహంతోనే జరుగుతాయని , ప్రతి ఒక్కరూ దేవునికి దగ్గరయ్యే ప్రయత్నం చేయాలని సూచించారు. తిరుమల తిరుపతి తర్వాత అంతటి మహిమాన్విత, పురాతన ఆలయం ఈ బొల్లవరం శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం అని, ఈ ఆలయాన్ని గత పాలకమండలినీ స్పూర్తిగా తీసుకొని ఈ పాలకమండలి అభివృద్ధి చేయాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత తొలి ఆలయ పాలక మండలి ఇదే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సురేష్ నాయుడు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఇ.వి. సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు వి.ఎస్. ముక్తియార్, ఆసం రఘురామి రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, చెన్నమరాజు పల్లె సహకార సంఘం చైర్మన్ పల్లేటి చంద్రశేఖర్ రెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, లింగాపురం ఏజిఆర్ బ్యాంకు చైర్మన్ సిద్ధారెడ్డి నాగముని రెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, బిసి నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్, వద్ది బాలుడు, స్థానిక నాయకులు మాజీ కౌన్సిలర్ రమణ, యనమల సుబ్బారెడ్డి, యనమల రాజా, ధనిరెడ్డి శ్రీధర్ రెడ్డి, 26వ వార్డు టిడిపి నాయకులు తలారి రమేష్ కాచన శ్రీనివాసుల రెడ్డి మరియు మున్సిపల్ కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

# రైతు శ్రేయస్సుకోసం పాటుపడాలి : ఎమ్మెల్యే చైతన్య రెడ్డి



**చింతకొమ్మదిన్నె పబ్లిక్ టుడే :** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్,సభ్యులు రైతుల శ్రేయస్సు కోసం పాటుపడాలని సూచించారు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి.సోమవారం నాడు చింతకొమ్మదిన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ గా ఇల్లూరి శివ శంకర్ రెడ్డి డైరెక్టర్ చప్పిడి వెంకటరమణ,గంగిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే చైతన్య రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎసిఎస్ చైర్మన్లు,డైరెక్టర్లు రైతులకు సహకార రుణాలు విరివిగా ఇప్పించి,రైతుల అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు,రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి అటు బ్యాంక్ అభివృద్ధి కూడా తోడ్పడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ టి వి కృష్ణారెడ్డి.రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెక్రటరీ గగ్గుటూరి నజీర్,నాగిరెడ్డిపల్లె పిఎసిఎస్ చైర్మన్ మోహన్ బాబు,నాయకులు భాస్కర్ రెడ్డి,మాధవరెడ్డి,రాజారావు, నాగేందర్ రెడ్డి,ఓబుల్ రెడ్డి రైతులు మరియు టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్ ఇండియా 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం ప్రారంభం




▶ డీఎస్పీ యం.ఆర్. కృష్ణమోహన్

**రాయచోటి, ఆగస్టు 24: పబ్లిక్ టుడే** జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్, ఆదేశాల మేరకు, ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలతో ఈరోజు రాయచోటిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని రాయచోటి డీఎస్పీ. యం.ఆర్. కృష్ణమోహన్ జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డీఎస్పీ. కృష్ణమోహన్ మాట్లాడుతూ, "ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రజలు, పోలీసులు కలిసి ప్రతి ఆదివారం సైక్లింగ్ అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం. సైక్లింగ్ కేవలం ఒక వ్యాయామం మాత్రమే కాదు, అది మన మనసుకు ఉత్సాహాన్ని, తాజాదనాన్ని ఇస్తుంది. అలాగే, యోగా సాధన మనలోని ఏకాగ్రతను పెంచి, మానసిక ప్రశాంతతకు తోడ్పడుతుంది. ఆరోగ్యమే మహాభాగ్యం. మన ఆరోగ్యం బాగుంటేనే మనం ఏ పనైనా సమర్థవంతంగా చేయగలం. ఈ 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి. ప్రతీ ఒక్కరూ తమ దైనందిన జీవితంలో వ్యాయామాన్ని ఒక భాగంగా చేసుకోవాలని కోరారు. అలాగే సైక్లింగ్ వల్ల పర్యావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం పోలీస్ సిబ్బందిలో కొత్త ఉత్సాహాన్ని నింపి వారిని మరింత ఫిట్ గా ఉంచుతుందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాయచోటి రూరల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్, లక్కిరెడ్డిపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ టివి.కొండారెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వి.జె.రామకృష్ణ, యం.పెద్దయ్య, ఎస్ఐ లు, ఆర్ఎస్ఐ లు, పోలీసు సిబ్బంది, హోంగార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రమధాన కార్యక్రమంలో శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు



**పులివెందుల (పబ్లిక్ టుడే )**పులివెందులలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం శ్రీ చైతన్య డిగ్రీ కళా శాల బీకాం విద్యార్థులు శ్రమదానం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు ఆలయ ప్రాంగణంలోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. రోడ్లను పరిచారు. పరిసరాలను అందంగా తీర్చిదిద్దా రు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కెవి రమణ విద్యార్థులకు శ్రీ రంగనాథ స్వామి చరిత్ర పుస్తకాలను అందజేశారు. విద్యార్థుల కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏపీజేయు రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ అల్లం రంగనాయ కులు, ప్రిన్సిపాల్ వై ఎన్ రెడ్డి, ఆలయ సిబ్బంది విజయ్ హిందూ ప్రతినిధి జై కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మంటపాల అనుమతికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు



చెన్నూరు (పబ్లిక్ టుడే) వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాలు పెట్టుకోవ డానికి అలాగే మండపాలకు సంబంధించి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని వీటికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని సీఐ ఎం కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ, మండల పరిధిలోని ప్రజలు ఎలాంటి ఖర్చు లేకుండా పోలీసు సేవలు వినియోగిం చుకోవాలని తెలిపారు. మండపాల దగ్గర ఊరేగింపు సమయంలో ఎలాంటి అశ్లీల నృత్యాలు చేయరాదని అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుం దని ఆయన అన్నారు. అదేవిధంగా రాత్రి 10 గంటలు దాటిన తరువాత ఎలాంటి డీజేలు, మైకులు పెద్దపెద్ద సౌండ్‌లతో పెట్టరాదని ఈ విషయాలను వినాయక చవితి కమిటీ గ్రహించాలని తెలియజేశారు. కులమతాల కతీతంగా వినాయక చవితి పండుగను ప్రజలు జరుపుకోవాలని వినాయక నిమజ్జనం జరిగే రోజు విగ్రహాలను తీసుకోనిపోయే వాహన డ్రైవర్లు ఎట్టి పరిస్థితిల్లో మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలియజేశారు. చిన్నపిల్లలను నిమజ్జనం వద్దకు తీసుకువెళ్లరాదని, నిమజ్జనం చేసేవారు ముందుగా వారి రూట్ మ్యాప్ ను పోలీసులకు తప్పనిసరిగా తెలియజేయాలని, మనం చేసే పండుగ మంచి కోసమై ఉండాలే కానీ చెడు కార్యక్రమాలకు గొడవలకు దారి తీయకూడదని తెలిపారు.ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా తమకు సమాచారం ఇస్తే తాము పరిష్కరించడానికి తమ సిబ్బందితో అన్ని విధాల మీకు సహకరిస్తామన్నారు. ఎవరైనా అల్లర్లు గలాటాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# మహిళను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసగించిన వ్యక్తి అరెస్ట్



**చెన్నూరు (పబ్లిక్ టుడే)**చెన్నూరు టౌన్ వనం వీధికి చెందిన పెరుగు శివ శంకర్ అనే వ్యక్తి చెన్నూరు సరస్వతికి నగర్ కు చెందిన మహిళను ప్రేమించి పెళ్లి చేసుకుంటా నని ఆమెను నమ్మించి గర్భవతిని చేసి మోసం చేసిన కేసులో ముద్దాయి శివశంకర్ ను చెన్నూరు సిఐ ఎం కృష్ణారెడ్డి సోమవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు. తనను శివశంకర్ నమ్మించి మోసం చేశాడని మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని కాగా ఈ విషయమై ముద్దాయి శివశంకర్ ను అరెస్టు చేసి కోర్టు కు హాజరు పరచగా కోర్టు అతనిని రిమాండ్ కు పంపినట్లు పోలీసులు తెలియజేశారు.

# వినాయక చవితి పండుగను శాంతియుతంగా నిర్వహించుకోండి

▸ జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



రాయచోటి, ఆగస్టు 25 (పబ్లిక్ టుడే) వినాయక చవితి పండుగ సామాజిక సామరస్యానికి ప్రతీక అని... పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకుండా సంబంధిత అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన వినాయక చవితి పండుగను శాంతియుతంగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకునేందుకు అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి లతో కలిసి శాంతియుత కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సామాజిక సమగ్రతను ప్రతిబింబించే పండుగ అని, ప్రజలు సామరస్యంతో పాల్గొని సాంప్రదాయబద్ధంగా పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. పండుగ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వినాయక విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (%ూూ%) విగ్రహాలు ఉపయోగించకుండా, మట్టి వినాయకులను ప్రోత్సహించాలని పండుగ నిర్వాహకులను కోరారు. నిమజ్జన ఘాట్ల వద్ద లైటింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలు, రక్షణ బృందాలు వంటి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. పండుగ రోజుల్లో నిరంతరం విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని, పారిశుధ్యం , మెడికల్ టీం ఏర్పాటు చేయాలని, అలాగే ఫైర్ సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని, తదితర అంశాల్లో ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయా సంబంధిత అధికారులను సూచించారు. పండుగ ఉత్సవాల్లో పాల్గొనే ప్రజలు సాంప్రదాయ విలువలను కాపాడుతూ, మిత వ్యయం పాటిస్తూ, ఇతర మతాల భావాలను గౌరవించేలా ప్రవర్తించేలా అవగాహన కల్పించాలని ఉత్సవ కమిటీ సభ్యులను కోరారు. నిమజ్జన ప్రదేశాలను ముందుగానే గుర్తించాలని, కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి మాట్లాడుతూ పండుగ సందర్భంలో శాంతి భద్రతలో ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రాంతాలలో రాత్రిపూట కమిటీ సభ్యులు ఎవరినైనా వాలంటీర్లను నియమించుకోవాలని వారి జాబితాను సంబంధిత పోలీస్ స్టేషన్లో ఇవ్వాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అలాగే నిమజ్జనం జరిగే రోజున వాహన డ్రైవర్ బ్రీత్ అనాలసిస్ చేయడం జరుగుతుందని తద్వారా ప్రమాదాలను జరగకుండా చూసేందుకు వీలవుతుందని తెలిపారు. సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బృందాలను నియమించి పహారాతో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేస్తామన్నారు. ఈ శాంతియుత కమిటీ సమావేశం ద్వారా వినాయక చవితి పండుగను సుఖసంతోషాలతో, శాంతి సామరస్య వాతావరణంలో జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ మధుసూదన్ రావు, రాయచోటి ఆర్డిఓ శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్లు, డిపిఓ, కాలుష్యం నియంత్రణ మండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పండుగ కమిటీ ప్రతినిధులు, మత పెద్దలు పాల్గొన్నారు.



# ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

పులివెందుల (పబ్లిక్ టుడే ) పులివెందుల వ్యవసాయ డివిజన్ లోని పులివెందుల పట్టణంలో ఉన్న ఎరువుల దుకాణాల పైన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం వ్యవసాయ శాఖ ,పోలీస్ డిపార్ట్మెంటు మరియు విజిలెన్స్ డిపార్ట్మెంట్ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ఏడు ఎరువుల దుకాణాల పైన తనిఖీలు నిర్వహించగా ఇందులో ఆయా దుకాణా లలో సబ్సిడీ ద్వారా రైతులకు అందే ఎరువులు ముఖ్యంగా యూరియా, డిఏపి, ఎంఓపి, కాంప్లెక్స్ ఎరువులకు సంబంధించిన అమ్మకాలు కొనుగోలు వివరాలను ముఖ్యంగా యూరియాకు సంబంధించి స్టాక్ వివరాలు మరియు రైతులకు అమ్మిన వివరాలను సంబంధిత స్టాక్ రిజిస్టరు మరియు రసీదులను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. అదేవిధంగా ఫారం ఓ మరియు గోడౌన్ వివరాలను పరిశీలించడం జరిగింది. అదేవిధంగా ఆయా ఎరువుల దుకాణదారులు రైతులకు అమ్మిన వివరాలు పరిశీలించడం జరిగింది. ఇందులో భాగంగా వివిధ కారణాల చేత అక్కడున్న లోపాలను గుర్తించి అందులో ఏడు దుకాణాలకు సంబంధించి సుమారు 47 లక్షల రూపాయలు విలువ చేసి వివిధ రకాల ఎరువులను తాత్కాలికంగా వాటి అమ్మకాలను నిలుపుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్వి రమణ అదేవిధంగా విజిలెన్స్ డిపార్ట్మెంట్ హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ మరియు స్థానిక మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తిరుపాల్ రెడ్డిని విమర్శిస్తే పుట్టగతులు ఉండవు

పులివెందుల టౌన్ (పబ్లిక్ టుడే) బిజెపి నాయకుడు కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డిని విమర్శిస్తే పుట్టగతులు ఉండవని ఆ పార్టీ నాయకులు అనిల్, శివ, తరుణ్, బాబావలీలు పేర్కొన్నారు. ధ్రువను విమర్శించే హక్కు లేదంటూ ఆ పార్టీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఖాదర్ ఓ పత్రిక ద్వారా చేసిన ప్రకటన పట్ల స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలలో పార్టీలు మారడం సహజం అనే విషయం ఖాదర్ కు తెలియకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎక్కడ ఏ పార్టీ పెట్టింది ప్రస్తుతం ఏ పార్టీలో కొనసాగు తుందో తెలుసుకుంటే మంచిదన్నారు. తిరుపాల్ రెడ్డి రాజకీయాలలో ఎదుగుదల చూసి ఓర్వలేక విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా విభజించడం వల్లనే కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర ప్రజలు నిలువ నీడ లేకుండా చేశారన్న సంగతి ఖాదర్ గుర్తుపెట్టుకోవాలన్నారు. పులివెందుల జడ్పీటీసీ ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయన్నారు. ఆడ లేక మద్దెలవోడు అన్న చందంగా వాళ్ల పార్టీ అభ్యర్థికి డిపాజిట్ రాకపోతే ఇతరులపై నిందలు వేయడం బావ్యం కాదన్నారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో అభివృద్ధి జరిగిందని ఈ విషయాన్ని ఎప్పుడైనా ఎక్కడైనా నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామంటూ సవాల్ విసిరారు. నీతి నిజాయితీగా వ్యవహరిస్తూ ప్రజాసంక్షేమం కోసం పాటుపడుతున్న తిరుపాల్ రెడ్డిని విమర్శిస్తే ప్రజలు క్షమించరని వారు హితవు పలికారు.



## పేదలకు ఆపదలో అండగా నిలుస్తోన్న సీఎం సహాయ నిధి

▸ జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి



పులివెందుల (పబ్లిక్ టుడే )రాష్ట్రంలోని పేద ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు అండగాసీఎం సహాయ నిధి నిలుస్తోంది అని పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి అన్నారు. పులివెందుల లోని స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాల యంలో సోమవారం ఒక కోటి ఎనభై ఆరు వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధి కింద పులివెందుల నియోజక వర్గానికి చెందిన 212 మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి మాట్లాడుతూ వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న పేదలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందనీ ఈ నిధులు పార్టీలకు అతీతంగా, కేవలం అర్హత ఉన్నవారికి మాత్రమే అందించబడుతు న్నాయనీ అందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.వైద్య సహాయానికి సీఎం చంద్రబాబు అందించిన నిధులు సకాలంలో చేరేలా కృషి చేసిన బిటెక్ రవికి లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల సింగిల్ విండో ప్రెసిడెంట్ సునీల్ , టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా నిలవండి..జిల్లా ఎస్పీ

పబ్లిక్ టుడేలి రాయచోటి, ఆగస్టు 25: జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో, జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల సమస్యలను జిల్లా ఎస్పీ వి.విద్యా సాగర్ నాయుడు, స్వయంగా ఆలకిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ బాధితుల సమస్యలను చట్టపరంగా, వీలైనంత త్వరగా పరిష్కరించాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉంది అని పేర్కొన్నారు. ఫిర్యాదు దారులతో ప్రత్యక్షంగా మాట్లాడిన ఎస్పీ, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల్లో ముఖ్యంగా కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు,



కుటుంబ సభ్యుల వేధింపులు, భూ వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు,ఆన్‌లైన్ మోసాలు, ప్రేమ పేరుతో మోసాలు లాంటివి ఉన్నాయి. ప్రతి ఫిర్యాదుపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా నేరుగా ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదు దారులకు న్యాయం చేయండి. బాధితులకు బాసటగా నిలవండి. చట్ట పరిమితుల్లో మానవీయంగా స్పందించండి అని ఎస్పీ సూచించారు. తీసుకున్న చర్యలపై నివేదికను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, మరియు మహిళల ఫిర్యాదులకు ప్రాముఖ్యత నిస్తూ, సమగ్రంగా విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి స్వయంగా రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను తమ స్థానిక పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయం లేదా సబ్ డివిజన్ కార్యాలయంలో ఇవ్వవచ్చని తెలిపారు. ఈ ఫిర్యాదులు కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగానే పరిగణించబడతాయని ఎస్పీ స్పష్టం చేశారు.

# ఏఐసీటీఈ – అటల్ ఎఫ్‌డీపీ

- **ఎలక్ట్రిక్ వెహికిల్స్‌లో తాజా పరిణామాలపై విశ్లేషణ**

**చింతకొమ్మాదిన్నె , పబ్లిక్ టుడే :** కడప కె ఎస్ ఆర్ ఎం కాలేజ్ మరియు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అటల్ అకాడమీ కింద నిర్వహిస్తున్న "రీసెంట్ డెవలప్మెంట్స్ ఇన్ ఎలక్ట్రిక్ వెహికల్స్ " అనే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ( ఎఫ్ డి పి )ఆగస్ట్ 25 నుంచి 30 వరకు వారం రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ ఐఐటి, ఎన్ ఐఐటి మరియు అధ్యాపకులు,పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు కలిసి విద్యార్థులకు మరియు పరిశోధనకు అన్వయించే విధంగా ఎలక్ట్రిక్ వెహికిల్ ( ఇవి ) సాంకేతిక పరిణామాలను విశ్లేషించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టెక్నికల్ అడ్వైసర్,ఇవి నెక్సిస్ ప్రైవేట్ కంపెనీ చెన్నై,మోహన్ వేల్ పాల్గొని మాట్లాడుతూ బ్యాటరీ టెక్నాలజీ పవర్ ఎలక్ట్రానిక్స్, వాహన నియంత్రణ,చార్జింగ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, భద్రతా ప్రమాణాలు,మరియు తయారీ ప్రక్రియ వంటి అంశాలపై ప్రసంగించారు. అనంతరం కెఎస్ఆర్ఎం కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీ ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ సిద్ధాంతం–ప్రాక్టికల్ మధ్య ఉన్న తేడాను పూరించడానికి ల్యాబ్ ప్రాక్టీసులు, కేస్ స్టడీలు చాలా ముఖ్యమని ప్రస్తావించారు. కె ఎస్ ఆర్ ఎం కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ వివిధ బ్యాటరీలలో వైవిధ్యం ప్రయోజనాలు, పరిమితులు, ఖర్చు, భద్రత, బ్యాటరీ మేనేజ్ మెంట్ సిస్టమ్‌లో జరుగుతున్న అభివృద్ధులను వివరించారు. ప్రోగ్రాం కన్వీనర్, మెకానికల్ విభాగాధిపతి సురేష్ మాట్లాడుతూ చార్జింగ్ పరిణామాలు, సాఫ్ట్‌వేర్ డిఫైండ్ వెహికిల్స్, భద్రతా ప్రమాణాలు, ల్యాబ్, శిక్షణమోటార్ కంట్రోల్,విద్యా ప్రణాళికలో కొత్త సిలబస్ డిజైన్, విద్యార్థి ప్రాజెక్టుల రూపకల్పనకు దోహదపడే విధంగా సెషన్లు నిర్వహిస్తమన్నరు. ఈ కార్యక్రమనికి కాలేజ్ కరస్పాం డెంట్ కందుల రాజేశ్వరీ,కన్వీనర్లు డాక్టర్ ఎం. వి. నారాయణ, మెకానికల్ హెచ్ఓ డీ సురేష్ కుమార్, కో ఆర్డినేటర్ డాక్టర్ టీ. సీ. పాములేటీ,డాక్టర్ డీ. రవి కాంత్, వివిధ ఐఐటి , ఎన్ ఐఐటి , ఇండస్ట్రీ ఎక్స్పర్ట్స్ హాజరయ్యారు.

